వినాయకచవితి కాలమ్స్ దాటని కథల పోటీలో రు. 125 మొదటి బహుమతి పొందిన రచన

# కాగితం పులి

''ఏంటా దేభ్యం మొహం, నవ్వొచ్చా, నేను ఇంటికి వచ్చే సరికి జిడ్డు మొహంతో ఇలానా వుండేది'' భర్త అన్న మాటలు గుర్తు వచ్చాయి. పెళ్ళయి సంవత్సరమైంది. మధుర స్మృతులు సరే — పెద్దగా గుర్తుంచుకోదగిన స్మృతులు కూడా లేవు. రాత్రిళ్ళు మాత్రం ఆయన ఇష్ట ప్రకారం అభిసారికలా ముస్తాబవ్వాలి. ఈయన కాస్త శుభ్రంగా వుంటే బావుణ్ణు అని అనుకున్న రోజులే ఎక్కువ. ఆలోచనలను పక్కకునెట్టి తన కిష్టమైన లేత ఆకుపచ్చ చీర, అదే రంగు బ్లవుజు, జడలో మల్లెలు, ముఖాన చిన్ని సూర్యుడిలా వెలిగిపోతున్న ఎర్రటి బొట్టు ముస్తాబయింది.

సాయంత్రం వీధి చివరగా ఎవరో వ్యక్తితో వస్తున్న తన భర్తని చూసి గబగబా కాఫీ సిద్ధం చేసింది. ఇంట్లోకి వచ్చిన భర్త ఆమెని చూసి మెరిసిన కళ్ళను వెంటనే ఆర్పుకుని ''సర్లే రెండు కాఫీ పట్టా మా ఫ్రెండొచ్చాడు'' అన్నాడు. కాస్త బూందీ, కాఫీ తీసుకొచ్చింది. పరిచయాలయ్యాయి. ఫ్రెండ్ ముఖంలో మెచ్చుకోలు పసిగట్టాడు. ఫ్రెండ్ వెళ్ళిం తర్వాత ''ఏంటా షోకులూ, సింగారింపులూ బజారు దానిలా'' అన్నాడు. చివుక్కుమంది మనస్సు! ఏమనే ధైర్యం లేదు.

* * *

ఆ రోజు చాలా కాలం తర్వాత ఇద్దరూ సెకండ్ షో సినిమాకు వెళ్ళారు. వీళ్ళ సీట్ల వెనుక ఇద్దరు అల్లరి కుర్రాళ్ళు చేరారు. పక్కనే మగవాడున్నాడని గూడా అధైర్యపడకుండా ఆమె మెడను వేళ్ళతో నవరించారు. ఉలిక్కిపడి కాస్త ముందుకు జరిగింది. కుళ్ళు జోకులు వేస్తూ ఆమె నున్నని నడుము కొలుస్తున్నట్లుగా చేతులు వేస్తున్నారు. భరించలేక భర్తకు చెప్పింది తను. వెనక్కు తిరిగి చూడనైనా చూడకుండా 'నువ్వే కాస్త ముందుకు కూర్చో గూడదు' అని కసిరాడు. అది గమనించి వెనకచేరిన ఇద్దరూ పెచ్చురేగిపోతున్నారు. చుట్టుపక్కలున్న వాళ్ళు గూడా ఏమీ పట్టించుకోలేదు. తను తనువెల్లా జలదరింపగా కంపరంతో ఇక ఏమాత్రం భరించ లేనట్లుగా, నాగుపాములా చివ్వున లేచి చేతిలోకి తీసుకున్న హైహీల్‌తో వెనక్కు తిరిగి ఫటాఫట్ ఫట్‌ఫట్ మని ఆగకుండా మొహాలపై కొట్టింది.



రొప్పుతూ, ''ఇడియట్స్! రాస్కెల్స్!! ఆడదంటే అంత అలుసురా. ఇష్టం వచ్చినట్టు మీరంటే పడడానికీ, వాడుకోడానికీ ఒక బానిస, యంత్రం అనుకున్నార్రా స్కౌండ్రల్స్.'' వాళ్ళప్పటికే అరుస్తూ బాధతో పారిపోయారు. చుట్టుపక్కల వాళ్ళు శెభాష్ అన్నారు.

ఆ సంఘటన తర్వాత ఎప్పుడూ తన భర్త ఇష్టం వచ్చినట్టు మాట్లాడినట్టు గుర్తులేదు తనకు.

—ఎం.సి హెచ్. పూర్ణచంద్రరావు

## కాలమ్స్ దాటని

వినాయక చవితి సందర్భంగా మేము నిర్వ హించిన కాలమ్స్ దాటని కథల పోటీకి అసంఖ్యాకంగా కథలు అందాయి. ప్రక టించినట్టుగానే ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల క్రింద ఎంపిక చేసిన మూడేసి కథల వివరాలను తెలియ జేస్తున్నాము.

### ప్రథమ బహుమతి పొందిన కథలు

1. తురాయి పూలు— జె యమ్, రాయగడ
2. చూపు - తమ్మన శశిధర కుమార్, తిరువూరు
3. కాగితంపులి - ఎం.సిహెచ్. పూర్ణచంద్రరావు, కొవ్వూరు

### రెండవ బహుమతి పొందిన కథలు

1. కాలమ్స్ దాటని కథ - రాజ్ శ్రీనివాస్, చోడవరం

వినాయకచవితి కాలమ్స్ దాటని కథల పోటీలో రు. 75 రెండవ బహుమతి పొందిన రచన

# ముందరి కాళ్లకు బంధం

ఇంట్లోకి అడుగు పెట్టిన తండ్రికి ఆనందంగా ఎదురు వచ్చింది హిమజ ''బాగున్నావా నాన్నా!'' అంటూ.

కూతురిని చూసిన ఆనందంతో అతనంత వరకు పడిన ప్రయాణపు బడలికను మరచిపోయి నవ్వాడు హాయిగా. ఆ నవ్వులోనే బాగున్నానన్న భావాన్ని వ్యక్తం చేశాడతను.

''అమ్మెలా వుంది? నా ఉత్తరం చేరిందా? ఎప్పుడు చేరింది? అమ్మను కూడా తీసుకురావలసింది. అమ్మ రానందా?'' తండ్రిని ప్రశ్నలతో ముంచెత్తింది హిమజ.

''ఆగాగు... కాస్త ఆయన్ని స్థిమిత పడనీ! మామయ్య గారూ! బాగున్నారా? అత్తయ్య గారెలా వున్నారు?''అంటూ లోపల గదిలోంచి వచ్చిన శ్రీనాధ రావు అడిగాడు.

''నన్ను ఆగమని చెప్పి మీరూ ప్రశ్నలతో రెచ్చిపో తారేం?'' విసుక్కుంది హిమజ.

వారి ఆప్యాయతకు కరిగిపోయాడు ఆయన.

''లేవండి నాన్నా! ఉదయం ఎప్పుడు తిన్నారో ఏమిటో! మీ రసలే ఆకలికి ఆగలేరు'' ఆప్యాయంగా అన్నది హిమజ. లేచి బాత్రూంలోకి వెళ్ళారు ఆయన.

భోజనం దగ్గరకు వచ్చేసరికి అల్లుడు ఆయన కోసమే చూస్తూ వున్నాడు.

''అదేమిటి బాబూ... నువ్వింకా భోం చేయ లేదూ?'' ఆశ్చర్యంగా అడిగాడాయన.

''మీరొస్తారనే ఎదురు చూస్తున్నానండీ..'' నవ్వుతూ అన్నాడతను.

''అసలు స్టేషన్‌కే రావాలని తయారయారు. కానీ, ఇంతలో మీరే వచ్చేసారు. కదండీ...'' భర్త వంక ఓరగా చూస్తూ అంది హిమజ.

అతను ఒక్క క్షణం ఆశ్చర్యపోయి, తిరిగి అంతలోనే తేరుకుని ''అదే... రావాలనుకున్నాను..'' అన్నాడు తడ బాటుగా.